క్లుప్తంగా

నేడు ఇళ్ల పట్టాల పంపిణీ

వంగర: స్థానిక ఎంపీడీవో కార్యక్రమంలో నిరు పేదలకు సోమవారం ఇళ్లపట్టాల పంపిణీ చేస్తున్నట్లు ఎంపీపీ ఉత్తరావెల్లి సురేష్‌ముఖర్జీ, జెడ్పీటీసీ కరణం రాధమ్మ ఓ ప్రకటనలో ఆదివారం తెలిపారు. ఈ కార్యక్రమానికి వైఎస్సార్‌సీపీ రాజాం నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ తలే రాజేష్ హాజరుకానున్నారన్నారు. కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

చోడిసాగుపై రైతుల ఆసక్తి


అంబఖండిలో సాగులో చోడిపంట

రేగిడి: మండలంలోని రైతులంతా చోడిసాగుపై ఆసక్తి చూపిస్తున్నారు. అంబఖండి, కొర్లవలస, పనసలవలస, మునకలవలస గ్రామాల్లోని రైతులంతా ఇప్పుడు చోడిపంటను సాగుచేస్తున్నారు. మండల వ్యాప్తంగా మొత్తం 150 ఎకరాల్లో ఈ ఏడాది చోడిసాగు జరుగుతోందని ఏవో జి.మురళీకృష్ణ తెలిపారు. మార్కెట్‌లో చోడిపిండికి మంచి డిమాండ్ ఉండడంతో రైతులంతా సాగు చేస్తున్నారన్నారు.

వాహన తనిఖీలు


ఆటోడ్రైవర్‌కు సూచనలిస్తున్న పోలీసులు

రేగిడి: మండలంలోని మజ్జిరాముడుపేట, బూరాడ, చిన్నశిర్లాం జంక్షన్లలో ఎస్‌ఐ ఇ.శ్రీనివాసరావు ఆదివారం వాహన తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన అటువైపుగా రాకపోకలు సాగిస్తున్న వాహనాలను ఆపి, వాటికి సంబంధించిన ధ్రువపత్రాలు, వాహనదారుడి డ్రైవింగ్ లైసెన్స్‌లను పరిశీలించారు. ప్రతిఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించి, ప్రమాదాల నివారణకు సహకరించాలని కోరారు. ఆటోల్లో పరిమితికి మించి ప్రయాణికులను తీసుకువెళ్లకూడదన్నారు.

పారిశుద్ధ్య పనులు


కాలువల్లోని పూడికలు తొలగిస్తున్న కూలీలు

వంగర: మండలంలోని బంగారువలస గ్రామంలో ఆదివారం పారిశుద్ధ్య పనులు చేపట్టారు. సర్పంచ్ సాదెం లలితకుమారి, వైఎస్సార్‌సీపీ నేత సాదెం శ్రీరామ్మూర్తి ఆధ్వర్యంలో గ్రామంలోని ప్రధాన వీధుల్లోని చెత్తాచెదారం తొలగించడంతో ఎస్సీ కాలనీలోని మురుగు కాలువల్లో పేరుకుపోయిన పూడికలు బయటకు తీసేశారు.

విస్తృతంగా అరటి సాగు


సోపేరు దగ్గరలో అరటి సాగు

రాజాం: మండలంలో అరటి సాగు విస్తృతంగా జరుగుతోంది. సోపేరు, రాజయ్యపేట, బొద్దాం, గారాజుచీపురుపల్లి గ్రామాల పొలాల్లో రైతులు అరటి పంటను పండిస్తున్నారు. సాగునీరు అందుబాటులో ఉండడంతో ప్రాంతాల్లో ఈ పంటను పెంచుతున్నారు. మండలంలో మొత్తం 180 ఎకరాల్లో అరటి సాగు జరుగుతోందని వ్యవసాయ శాఖ ఏడీ కె.చంద్రరావు తెలిపారు. చేతికి అందివచ్చిన అరటిగెలలను రాజాం మార్కెట్‌లో రైతులు విక్రయిస్తున్నారు.

చురుగ్గా తాగునీటి బోర్ల మరమ్మతులు


బోరు బాగు చేస్తున్న మెకానిక్ కృష్ణ

తెర్లాం: మండల వ్యాప్తంగా తాగునీటి బోర్ల మరమ్మతులు చాలా చురుగ్గా కొనసాగుతున్నాయి. వేసవి నేపథ్యంలో తాగునీటి సమస్య తలెత్తకుండా ఉండాలన్న ఎంపీడీవో బి.మధుసూదనరావు ఆదేశాల మేరకు పాడైన బోర్లను యుద్ధప్రాతికదిన బాగుచేసి, వినియోగంలోకి తీసుకువస్తున్నారు. ఆదివారం మండలంలోని తమ్మయ్యవలస గ్రామంలోని పాఠశాల వద్ద బోరును బాగుచేశారు.

మెహర్‌బాబా జయంతి

బొబ్బిలి: స్థానిక పట్టణంలో అవతార్ మెహర్ బాబా 130వ జయంతి ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా వీధుల్లో మెహర్‌బాబా చిత్రపటాన్ని ఊరేగించారు. అనంతరం బాబా మందిరం వద్ద భక్తులకు ప్రసాదం పంచిపెట్టారు.


నాడు-నేడు నిధులతో అందంగా తీర్చిదిద్దిన తరగతి గది


ఆహ్లాదకరంగా రంగప్పవలస పాఠశాల పరిసరాలు


బాలబాలికల కోసం వేర్వేరుగా నిర్మించిన మరుగుదొడ్లు

నాడు-నేడు..బడి అందం చూడు!

ఈ చిత్రంలో కనిపిస్తున్నది.. తెర్లాం మండలంలోని రంగప్పవలస ప్రాథమిక పాఠశాల. ఒకప్పుడు ఇది చాలా అధ్వానంగా ఉండేది. టీడీపీ హయాంలో జరిగిన నిర్లక్ష్యానికి బడిలో సదుపాయాలు అరకొరగా మాత్రమే ఉండేవి. ఎప్పుడు కూలిపోతాయో తెలియని తరగతి గదులు. విద్యార్థులు కూర్చొనేందుకు పెచ్చులూడిన గచ్చులు, సరైన తలుపులు కూడా లేని మరుగుదొడ్లు, అంతంతమాత్రంగా తాగునీటి సదుపాయం, పాఠశాల ఆవరణలో ఏ మూల చూసినా గోతులమయంగా ఉండేది. 2019లో అధికారంలోకి వచ్చిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం విద్యార్థులకు విద్యే అసలైన ఆస్తిగా భావించింది. మనబడి నాడు-నేడు పథకాన్ని ప్రవేశపెట్టి, ప్రభుత్వ బడుల రూపురేఖలు పూర్తిగా మార్చేసింది. ఈ క్రమంలోనే ఇక్కడి పాఠశాల సరికొత్త సొబగులు అద్దుకుంది. రూ.17.80 లక్షల నిధులతో శిథిలావస్థలోని తరగతి గదులను అత్యంత సుందరంగా తీర్చిదిద్దారు. పాఠశాల ఆవరణను ఆహ్లాదకరంగా మార్చారు. విశాలమైన ప్రదేశంలో మరుగుదొడ్లు నిర్మించారు. విద్యార్థులకు మంచినీటి సౌకర్యం కల్పించారు. అన్ని తరగతి గదుల్లో విద్యార్థులు కూర్చొనేందుకు కొత్త బెంచీలు తీసుకువచ్చారు. శిథిలమైన బ్లాక్‌బోర్డు స్థానంలో ప్రస్తుతం ఓ మంచి బోర్డును ఏర్పాటు చేశారు. ప్రస్తుతం ఇక్కడి పాఠశాల కార్పొరేట్ స్కూల్‌కు దీటుగా ఉండడంతో విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామస్తులు జగనన్న సర్కారు పనితీరుపై హర్షం వ్యక్తం చేస్తున్నారు. -తెర్లాం


విజ్ఞానం పంచే చిత్రాలతో అదనపు తరగతి గది

టీడీపీ సీట్ల కేటాయింపుపై ఎమ్మెల్యే విమర్శ


మాట్లాడుతున్న ఎమ్మెల్యే శంబంగి

బొబ్బిలి: రానున్న సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో జనసేన, టీడీపీలు ప్రకటించిన సీట్ల కేటాయింపును ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు విమర్శించారు. స్థానికంగా ఉన్న ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ ఆయా పార్టీలు చేసిన ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థుల ప్రకటనంతా ఓ బూటకమన్నారు. ఎన్‌టీఆర్‌కు వెన్నుపోటు పొడిచిన దగ్గర నుంచి టీడీపీ అధినేత చంద్రబాబు ఎప్పుడు ఎన్నికలు వచ్చినా ఏదో ఒక పార్టీతో పొత్తు పెట్టుకోవడం తప్ప ఒంటరిగా పోటీ చేసి దమ్మూధైర్యం చూపించిన దాఖలాలు లేవన్నారు. పొత్తులో భాగంగా డబ్బున్న వారికి, కొత్తవారికి సీట్లు ఇస్తూ ఎప్పటినుంచో పార్టీని నమ్ముకున్న సొంత పార్టీ నేతలను మోసం చేయడమే చంద్రబాబుకు అలవాటు అన్నారు. గతంలో తీసుకున్న నిర్ణయాలు, హామీలకు పాతరేసి, ఆయనకు నచ్చినవారికి సీట్లు ఇచ్చి, మిగతా వారిని పక్కనబెట్టేశారన్నారు. వైఎస్సార్ సీపీ అలా కాదని, తొలినాళ్ల నుంచి ఒకేపంథా కొనసాగిస్తోందన్నారు. ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులకు సంబంధించి, సీట్ల కేటాయింపులో సామాజిక వర్గాలకు ప్రాధాన్యమిస్తూ అభ్యర్థులను ఖరారు చేయడం జరుగుతోందన్నారు. అన్నివర్గాల్లోని ప్రజలకు సమన్యాయం చేస్తూ సీట్లు కేటాయిస్తోందన్నారు. గజపతినగరంలో జనసేన సీటు ఆశించిన పడాల అరుణను పక్కనబెట్టేశారన్నారు. ఇటీవల కొంతమంది అభ్యర్థులు కూడా మోసపోతున్నామని ఒకరినొకరు చెప్పుకుని బాధపడుతున్నారన్నారు. గతంలో తనను కూడా చంద్రబాబు మోసం చేసిన సంగతిని గుర్తుకు తెచ్చుకున్నారు. బీసీలకు ప్రాధాన్యమిస్తున్నామని చెప్పి, చాలాచోట్ల బీసీలుండగా ఇతరులకు టికెట్లు ఇచ్చారన్నారు. ఎవరైతే పార్టీని నమ్ముకున్నారో వారిని నట్టేటముంచే నైజమున్న చంద్రబాబునాయుడు త్వరలోనే తన పార్టీని బంగాళాఖాతంలో కలుపుకోవాల్సిన దుస్థితి వస్తుందన్నారు. టీడీపీ సీట్ల కేటాయింపు సరిగా లేనందు వల్లే ఆ పార్టీ నేతలే తీవ్ర ఆవేదనతో రోడ్లు మీదకు వస్తున్నారన్నారు. వారే రానున్న ఎన్నికల్లో టీడీపీని ఓడిస్తారన్నారు. రాష్ట్రంలో 175కు 175 అసెంబ్లీ సీట్లు, 25 ఎంపీ సీట్లు గెలుచుకుని, మరోసారి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి కావడం ఖాయమన్నారు. ఎమ్మెల్యే వెంట జెడ్పీటీసీ పెద్దింటి రామారావు, తదితరులు పాల్గొన్నారు.

కళాశాలగా రామభద్రపురం పాఠశాల అప్‌గ్రేడ్


కళాశాలగా అప్‌గ్రేడ్ అయిన రామభద్రపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల

రామభద్రపురం: ప్రతీ పేద విద్యార్థి మధ్యలో చదువులు ఆపేయకుండా ఉన్నత చదువులు చదవాలనే సదుద్దేశంతో మండలంలోని రెండు పాఠశాలలను కళాశాలగా అప్‌గ్రేడ్ చేస్తోంది. అందులో భాగంగానే రామభద్రపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను కో-ఎడ్యుకేషన్ కళాశాలగా అప్‌గ్రేడ్ చేసింది. 2024-25 విద్యాసంవత్సరం నుంచే కళాశాలల్లో విద్యార్థులు ఉన్నత చదువులు చదవవచ్చని ఉత్తర్వులు రావడంతో మండలంలోని విద్యార్థులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ముఖ్యమంత్రి కాగానే పేద విద్యార్థుల ఉన్నత భవిష్యత్‌కు బాటలు వేస్తున్నారు. ప్రభుత్వ విద్యాసంస్థల్లో చదివే విద్యార్థులు ప్రపంచ స్థాయికి ఎదిగేలా అన్ని రకాలుగా ప్రోత్సహిస్తున్నారు. దీనికోసం ఏటా బడ్జెట్‌లో రూ.వేల కోట్లు వెచ్చించి, సర్కారు బడులను కార్పొరేట్ స్కూళ్లకు దీటుగా తీర్చిదిద్దుతున్నారు. ప్రతీ పైసా పిల్లల ఉన్నత చదువుకే ఉపయోగపడేలా పాఠశాలల్లో అత్యున్నత మౌలిక వసతులు కల్పిస్తున్నారు. ఆహ్లాదకర వాతావరణంలో పిల్లలు చదువుకునేలా నాడు-నేడు పథకం కింద పాఠశాలల్లో సకల సదుపాయాలు, డిజిటల్ తరగతులు, మూడో తరగతి నుంచే టోఫెల్ పరీక్ష, అమ్మ ఒడి, రోజుకో వంటకంతో విద్యార్థులకు మధ్యాహ్న భోజనం వంటివి సమకూర్చుతున్నారు. విద్యారంగంపై ప్రభుత్వం తీసుకుంటున్న ప్రత్యేక శ్రద్ధపై సర్వత్రా హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఉత్తములను అనుసరించాలి

రేగిడి: మనుషులంతా ఉత్తములను అనుసరించి, మంచిమార్గంలో పయనించాలని పాలకొండకు చెందిన ఆధ్యాత్మిక వక్త ఎస్వీ రమణ అన్నారు. మండలంలోని దేవుదళ గీతాశ్రమంలో గొర్లె దామోదరావు అధ్యక్షతన ఆదివారం జరిగిన దివ్య జీవన సత్సంగ సమావేశంలో పాల్గొన్న ఆయన మంచి కార్యాన్ని ఎటువంటి విఘ్నాలు లేకుండా పూర్తి చేసిన వారే ఉత్తములని, వారి జీవితం, వారు జీవించిన విధానం ఆదర్శంగా తీసుకోవాలన్నారు. మనుషుల్లో ఉత్తములు, మధ్యములు, అధములు ఉంటారని, అందరి కంటే గొప్పవారు ఉత్తములని, వీరు ఏ తలంపు చేపట్టినా విజయం ఉంటుందని, అనుకున్నది సాధిస్తారన్నా రు. మధ్యములు ఏ కార్యమూ చేయలేరని, ఆరంభశూరత్వమేనని మధ్యలో పనిని విడిచిపెట్టేస్తారన్నా రు. అధములు నీచులతో సమానమని, వీరు పూర్తిగా పిరికితనంతో వ్యవహరిస్తారని, ఏ మంచి కార్యాన్ని అసలు తలంచరన్నారు. ఈ నేపథ్యంలో ఉత్తములు అనుసరించిన జీవన విధానం పాటిస్తూ ఉత్తమోత్తములుగా వెలుగొందాలన్నారు. మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో జి.దామోదరరావు, జి.మోహనరావు తదితరులు పాల్గొన్నారు.

మంచి కవిత్వానికే సమాజంలో ఆదరణ

- సాహితీవేత్త బమ్మిడి సుబ్బారావు


మాట్లాడుతున్న సాహితీవేత్త సుబ్బారావు

రాజాం సిటీ: మంచి కవిత్వానికి ఎప్పుడూ సమాజంలో ఆదరణ ఉంటుందని పలాసకు చెందిన సాహితీవేత్త బమ్మిడి సుబ్బారావు అన్నారు. స్థానిక మాధవబజారులోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో రారవే(రాజాం రచయితల వేదిక) సమావేశం ఆదివారం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన 'సమాజానికి అవసరమైన సాహిత్యం' అనే అంశంపై ప్రసంగించారు. కవిత్వం ప్రజా సమూహాన్ని ఆనందరపర్చడమో, కదిలించడమో చేయాలే గానీ ప్రజలకు అగమ్యగోచరంగా మారకూడదన్నారు. గురజాడ, శ్రీశ్రీ వంటి కవులు ప్రజలను కదిలించే కవిత్వాన్ని రాయడం వల్లే ప్రఖ్యాతులయ్యారన్నారు. జనాన్ని ఆనందపరిచే కవిత్వం రాయబట్టే నన్నయ్యను నాటి నుంచి నేటికీ గొప్పగా చెప్పుకుంటున్నారన్నారు. అగ్ని జల్లినా, అమృతం కురిసినా ఆనందమే దాని పరమావధి అని తిలక్ వాక్యాన్ని ఈ సందర్భంగా గుర్తుచేశారు. స్వతంత్ర ఉద్యమానికి ఊపిరి పోసింది కూడా ప్రజలను కదిలించే కవిత్వమేనని చిలకమర్తి వారి పద్యాన్ని చదివి, వినిపించారు. నన్నయ్య నుంచి నేటి వరకు ఉన్న ప్రాచీన, ఆధునిక కవుల పద్య పాదాలను, వాక్యాలను చదివి వాటిలోని తీయదనాన్ని వివరించారు. అనంతరం బమ్మిడి సుబ్బారావు రాసిన జనజాగృతి గీతాలను పాలక కామేశ్వరరావు ఆలపించారు. కార్యక్రమంలో రారవే నిర్వాహకులు గార రంగనాథం, నల్ల రవికుమార్, ఒమ్మి రమణమూర్తి, ఉరిటి రామలింగేశ్వరరావు, ఆల్తి మోహనరావు, పిల్లా తిరుపతిరావు, పెంకి దయానిధినాయుడు, రొట్ట గణపతిరావు, నేతేటి గణేశ్వరరావు, పొదిలాపు శ్రీనివాసరావు, పడాల కవీశ్వరరావు, కొత్తా సాయిప్రశాంత్‌కుమార్, పెంకి చైతన్యకుమార్ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీలో పలువురి చేరిక


పార్టీ కండువాలు వేసి, సాదరంగా ఆహ్వానిస్తున్న జెడ్పీ చైర్మన్ శ్రీనివాసరావు

రాజాం సిటీ: మండంలోని పలు గ్రామాలకు చెందిన టీడీపీ కార్యకర్తలు వైఎస్సార్ సీపీలో చేరారు. మండల కేంద్రంలో ఆదివారం జరిగిన నియోజకవర్గ స్థాయి సమావేశానికి హాజరైన పార్టీ ఉత్తరాంధ్ర రీజనల్ కో-ఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి, రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణల సమక్షంలో రాజాం మండలంలోని బొడ్డవలస గ్రామానికి చెందిన 30 కుటుంబాలు, దోసరి గ్రామానికి చెందిన మరో 30 కుటుంబాలు, రేగిడి మండలంలోని బాలకవివలస గ్రామానికి చెందిన 20 కుటుంబాల వారు పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. వీరందరికీ పార్టీ జిల్లా అధ్యక్షుడు, జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు పార్టీ కండువాలు వేసి, సాదరంగా ఆహ్వానించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలకు ఆకర్షితులమై తామంతా పార్టీలో చేరామని వారు తెలిపారు. రానున్న ఎన్నికల్లో పార్టీ విజయమే లక్ష్యంగా పనిచేస్తామన్నారు. ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్, పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ తలే రాజేష్, నియోజకవర్గ పరిశీలకులు కె.వి.సూర్యనారాయణరాజు పాల్గొన్నారు.

పుస్తక పఠనం అలవాటు చేసుకోవాలి


విద్యార్థులతో పుస్తకాలు చదివిస్తున్న లైబ్రేరియన్ కృష్ణమూర్తి

తెర్లాం: విద్యార్థులంతా ప్రాథమిక పాఠశాల స్థాయి నుంచే పుస్తక పఠనాన్ని అలవాటు చేసుకోవాలని లైబ్రేరియన్ సీహెచ్ కృష్ణమూర్తి సూచించారు. స్థానిక శాఖా గ్రంథాలయంలో చదువంటే మాకిష్టం కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో పుస్తకాలు చదివించడం, కథలు చదవడం, చెప్పించడం చేయించారు. అనంతరం లైబ్రేరియన్ విద్యార్థులనుద్దేశించి కాసేపు మాట్లాడారు. పుస్తక పఠనం ద్వారా కొత్త విషయాలు తెలియడంతో పాటు విజ్ఞానం పెంపొందించుకోవచ్చన్నారు. విద్యార్థులంతా ప్రభుత్వ కల్పిస్తున్న సదుపాయాలను సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

రైల్వే డీఆర్‌ఎం పరిశీలన

బొబ్బిలి: అమృత్ భారత్ పథకంలో భాగంగా దేశ వ్యాప్తంగా ఉన్న పలు రైల్వేస్టేషన్లను అభివృద్ధి చేసేందుకు కేంద్ర ప్రభుత్వం సంకల్పించింది. ఈ పథకానికి ఎంపికైన రైల్వేస్టేషన్లలో బొబ్బిలి రైల్వేస్టేషన్ కూడా ఉంది. ఈ మేరకు ఇక్కడి స్టేషన్ అభివృద్ధి పనులను వర్చువల్ ద్వారా ప్రధాని నరేంద్ర మోదీ సోమవారం ప్రారంభించనున్నారు. ఈ నేపథ్యంలో పట్టణంలో జరుగుతున్న ఏర్పాట్లను రైల్వే డీఆర్‌ఎం సౌరభ్‌ప్రసాద్ ఆదివారం పరిశీలించి, పలు సూచనలు చేశారు. సోమవారం ఉదయం 11.40 గంటలకు జరిగే ఈ కార్యక్రమంలో రైల్వే చీఫ్ ఇంజినీర్ ఎ.కె.పాండే, ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు, మున్సిపల్ చైర్మన్ ఎస్వీ మురళీకృష్ణారావు పాల్గొంటారన్నారు.

ట్రాఫిక్ నియంత్రణకు పటిష్ట చర్యలు


ట్రాఫిక్‌ను నియంత్రిస్తున్న ఎస్‌ఐ జ్ఞానప్రసాద్

రామభద్రపురం: మండల కేంద్రంలో ట్రాఫిక్ నియంత్రణకు పటిష్ట చర్యలు చేపడుతున్నామని ఎస్‌ఐ జ్ఞానప్రసాద్ అన్నారు. నాలుగు రాష్ట్రాల కూడలి కావడంతో ప్రయాణీకులతో పాటు రోజూ కొన్ని వందల వాహనాల రాకపోకలు సాగిస్తుండడంతో ట్రాఫిక్ సమస్య ఏర్పడుతోంది. గంటల కొద్దీ వాహనాలు నిలిచిపోతున్నాయి. ఆదివారం ఆయనే స్వయంగా ట్రాఫిక్‌ను నియంత్రించి, కాసేపు విలేకరులతో మాట్లాడారు. రోడ్డుకు ఇరువైపులా కొంతభాగం చొప్పున ఆక్రమణకు గురికావడం వాహనాల రద్దీ అధికంగా ఉండడంతో ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతున్నాయన్నారు.

ఆంగ్లంపై భయం పోగొట్టేందుకు కృషి


పరీక్షలు రాస్తున్న విద్యార్థులకు సూచనలిస్తున్న ఉపాధ్యాయులు

రాజాం సిటీ: విద్యార్థులకు ఆంగ్లంపై ఉన్న భయం పోగొట్టేందుకు కృషి చేస్తున్నామని ఫోరం ఆఫ్ ఇంగ్లిష్ టీచర్స్ అధ్యక్ష, కార్యదర్శులు బి.వి.అచ్యుత్‌కుమార్, ఆర్.వి.జె.నాయుడు అన్నారు. ఆదివారం స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నియోజకవర్గంలో పదో తరగతి చదువుతున్న 32 పాఠశాలల విద్యార్థులకు ఇంగ్లిష్ గ్రామర్, పదజాలానికి సంబంధించి, 80 మార్కులకు పరీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ త్వరలో జరగనున్న పబ్లిక్ పరీక్షల్లో విద్యార్థుల్లో ఆంగ్లంపై నెలకొన్న భయం వీడడంతో పాటు అధిక మార్కులు సాధించేందుకు ఇటువంటి పరీక్షలు ఎంతగానో దోహదపడతాయన్నారు. అనంతరం పరీక్షలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు వైద్యుడు రవిప్రసాద్, రణస్థలం ఎంఈవో ఎ.త్రినాథరావుల చేతులమీదుగా బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో సాయిప్రశాంత్‌కుమార్ పాల్గొన్నారు.

వైభవంగా బ్రహ్మోత్సవాలు

బొబ్బిలి: పట్టణంలోని స్వామి వారి వీధిలో శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయం వద్ద బ్రహ్మోత్సవాలు అత్యంత వైభవంగా కొనసాగుతున్నాయి. శనివారం నుంచి జరుగుతున్న ఈ వేడుకల్లో రోజూ స్వామి వారికి ప్రత్యేక పూజలు, అర్చనలు చేస్తున్నారు. సోమవారం మధ్యాహ్నం మహాన్నదానం కార్యక్రమం, సాయంత్రం కోలాట ప్రదర్శన చేయడంతో ఉత్సవాలు ముగుస్తాయని పురోహితులు శ్రీహరి, ఆలయ ధర్మకర్త తిరుపతిరావు తెలిపారు.

ప్రశాంతంగా గ్రూప్-2 పరీక్ష


పరీక్ష రాసేందుకు వెళ్తున్న అభ్యర్థులు

బొబ్బిలి: మండల కేంద్రంలో పలు కేంద్రాల్లో ఆదివారం జరిగిన గ్రూప్-2 పరీక్ష ప్రశాంతంగా జరిగింది. మొత్తం 8 పరీక్షా కేంద్రాల్లో 4,825 మంది పరీక్ష రాసేందుకు ఏర్పాట్లు చేయగా, 867 మంది పరీక్షకు గైర్హాజరయ్యారు. డీఎల్‌పీవో రవీంద్రరాజు పరీక్షల నిర్వహణను పరిశీలించారు.

ఫార్మా మోడల్‌లో.. కూరగాయల సాగుపై అవగాహన


ఫార్మా మోడల్ విధానంలో కూరగాయల సాగుపై అవగాహన కల్పిస్తున్న ప్రకృతి వ్యవసాయ సిబ్బంది

రేగిడి: మండలంలోని చాటాయవలస గ్రామంలో ఫార్మా మోడల్ ద్వారా కూరగాయల సాగుపై ఆదివారం అవగాహన కల్పించారు. ప్రకృతి వ్యవసాయం ఎల్-2 పార్వతమ్మ, గౌరీశ్వరరావు, ఐసీఆర్‌పీలు పైల తవిటినాయుడు, కూనుబిల్లి రమణల ఆధ్వర్యంలో కూరగాయలు ఎలా సాగు చేయాలన్న అంశంపై రైతులకు అవగాహన కల్పించారు. ఏడాది పొడవునా ఆకుకూరలు, తీగ, మొక్క జాతి కూరగాయలను పండించుకోవచ్చన్నారు. ప్రకృతి సేద్యం ద్వారా ఈ పంటలను సాగు చేసుకుంటే రైతులకు నిత్యం రాబడి ఉంటుందన్నారు. కార్యక్రమంలో సురేష్, రవి, గోవింద్, అప్పలనాయుడు, సర్పంచ్ కరణం గోవిందరావు తదితరులు పాల్గొన్నారు.

భూసార పరీక్షలతో రైతుకు మేలు


భూసార పరీక్షలతో కలిగే ప్రయోజనాలను వివరిస్తున్న ఏవో మురళీకృష్ణ

రేగిడి: భూసార పరీక్షలతో రైతులకు మేలు అని ఏవో మురళీకృష్ణ అన్నారు. మండలంలోని కోడిశ గ్రామంలో రైతు మిత్రలతో కలిసి మట్టినమూనాల సేకరణ ఆదివారం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ పరీక్షల ద్వారా నేల సారవంతమైనదీ లేనిదీ తెలియడంతో పాటు నేలకు అనువైన పంటను వేసుకోవచ్చన్నారు. ఈ ఏడాది ఆర్‌బీకేల ద్వారా మట్టినమూనాల సేకరణ చేస్తామన్నారు. అలాగే వ్యవసాయంలో యాంత్రీకరణ ఉపయోగాలను వివరించారు. కార్యక్రమంలో సిబ్బంది శరత్‌బాబు, బి.సూర్యనారాయణ, సాయి మణికంత పాల్గొన్నారు.